# పేదవాడికీ జై !

అసలు—

ఇది ఇప్పుడు చెప్పవలసిన కధ కాదు. పోనీ అని కొత్తరకం కధా కాదు. చాలా పాతకధ. పాతచింతకాయ పచ్చడికన్నా పాతకధ. మరెందుకు? ఇప్పుడు చెప్పటం - అంటారా, మరేమీలేదు. అన్నీ కొత్త కధలే వింటున్న మీకు ఓ పాతకధను వినిపిద్దామని. అయితే మీకో గ్యారంటీ ఇస్తున్నాను- ఇది పాతకథే అయినా, ఇప్పుడు కాకుండా ఎప్పుడో కొన్ని వందల సంవత్సరాల క్రితమే జరిగినా, ఈ దేశంలో కాకుండా మరేదో దేశంలో జరిగినా మీకు తెలియని కధ యిది. అంచేత వింటానికి మీ కభ్యంతరం వుండదనుకుంటాను. మరి.........

* * *

అదేదో దేశంలో-

అప్పుడెప్పుడో-

ఒక సభ జరుగుతోంది. ఆ సభలో ఇద్దరు మహానాయకులు, మరో యిద్దరు ఓహో నాయకులు పాల్గొంటున్నారు. (ఓహో నాయకులంటే- ఎవర్ని చూసినా సరే, "ఓహో! మీరా!!" అంటూ వెళ్ళి మాట్లాడేస్తూ వుండటంవల్ల వాళ్ళు ఓహోనాయకులైపోయారు.) ఒక ప్రముఖ కవిగారు అధ్యక్ష స్థానాన్ని ఆక్రమించారు. మహానాయకులు, ఓహో నాయకులు వేదికనలంకరించారు.

(కథ కడ్తొస్తున్నాను- ఆ దేశభాషలో నేను మీకు కథచెబితే మీ కర్థంకాదు కాబట్టి, తెలుగులోనే చెప్పేస్తున్నాను.)

పోతే-

అధ్యక్షస్థానంలోవున్న కవిగారు నాయకులను పొగడుతూ నాలుగు ముక్కలు చెప్పి తర్వాత ఒక మహానాయకుణ్ణి ఉపన్యసించవలసిందిగా కోరారు. ఆ మహానాయకులవారు వినయంగా లేచి, వినమ్రంగా మొహం పెట్టి -

సోదరసోదరీమణులారా!

నేడు చాలా సుదినం. ఎందుకంటే మనమంతా ఇక్కడ కలుసుకున్నాం. ఎందుకు కలుసుకున్నామంటే మన రాజధానిలో వున్నటువంటి మన అతివీరభయంకర నాయకులుగారు రూపొందించినటువంటి "పేదవారి పథకం" ఆవిష్కరణ ఈరోజే. దానిని పురస్కరించుకుని, మన వూళ్ళో కూడ, మనం కూడా, ఏటో ఉడతాభక్తిగా ఆ కార్యక్రమాన్ని అమలు జరుపుతానని చెప్పి మనవి చేయటానికి నాకు చాలా ఆనందంగా వుంది అని మనవిచేస్తూ నేను ఇంతటితో ముగిస్తున్నాను" అంటూ ముగించారు.

కరతాళధ్వనులు మారుమ్రోగాయి. అధ్యక్షులవారు మరో మహానాయకుణ్ణి మాట్లాడవలసిందిగా కోరటంతో ఆయనగారు మైక్ ముందుకి వచ్చారు. ఆయన మైక్ దగ్గిరకు రావటమే హైలైట్ అన్నట్టుగా, ముందుగానే చప్పట్లు కొట్టారు జనం. ఆయన 'శాంతించండి' అన్నట్టుగా చెయ్యి చాపి, జనం కొంచెం సద్దుమణిగాక, గొంతు సవరించుకుని-

"చోదరచోదరీమనులారా!

ఓ మణుసులారా!!

నేసెప్పబోయేదేటంటే - మంది చాలా పవిత్రదేశెం. ఎందుకంటే సానా గొప్పోళ్లంతా మందేశెంలోనే పుట్టారు. అదీగాకుండా మనమంతా

కూడా పుట్టాం. కాబట్టి నేసెప్పబోయేదేటంటే- మందీ శానా గొప్పదేశెం.

మహారాజశ్రీ మన అతివీరబయంకర నాయకులుగారు మొదలెట్టి నటువంటి "పేదోల్ల పతకం" శానా గొప్పది. మా సెడ్డ మంచిది. అంసేత నేసెప్పబోయేదేటంటే- మనమంతా ఆపతకం అమలు సేసుకున్న ట్టయితే శానా సుకపడిపోతాం.

'పేదోల్ల పతకం' అంటే బీదోల్ల పతకం. మందేశం శానా బీద్దేశం ఎందుకంటే మనమంతా బీదోల్లమేకదా! మనలో నూటికి డెబ్బై మంది పేదోల్లం. పేదోల్లే దేశానికి ఎన్నెముక కదా! ఎన్నెముకలేని మనిసెలా ఉండడో పేదోల్లులేని దేశెముండదు. ఎంతమంది పేదోల్లుంటే అంత గొప్ప దేశెమవుద్దికదా ఏదేశెమైనా కూడాను! (జనంలో కలకలం)

అంసేత—

నేసెప్పబోయేదేటంటే ఈ పేదోల్ల పతకం అమలుసేసుకోడం పెద్ద గొప్ప పనేమీ కాదు. ఉప్మానానికి నాకిదుగో ఈ అంగీ పంచే వున్నాయనుకోండి! అంగీ వుంచుకుని పంచె ఉంకోడికిచ్చేయటమన్న మాట- ఇదుగిదే చోసలిజముంటేను. జనంలో చప్పట్లు, నవ్వులు)

అదుగో మీరలా గోలసైకూడదు. కెమసిచ్చన నేర్చుకోవాలి ఎవు రైనా గొప్పోల్లు మాట్లాడుతుంటే ఇనుకోడం నేర్చుకోవాలి! (మళ్లీ జనంలో గోల) ఇంతకీ నే సెప్పొచ్చేదేమంటే—మీరలా గొడవసైకూడదు మీరలా గొడవసేత్తే నేసెప్పదల్సుకున్నదేదో మర్సిపోయే పెమాదం వుంది. నేసెప్ప దల్చుకున్నది మర్సిపోతే నట్టం నాకుకాదు. మీకే! అంసేత- కెమసిచ్చన, బాజ్జత ఈ రెండూ కూడా మీరంతా నేర్సుకోవాలని, మన అతివీరబయంకర నాయకులు సెప్పినట్టుగా, ఆరి అడుగుజాడల్లోనే మనమంతా అంటే - మీరంతా నడ్సుకోవాలని మనవిసేత్తూ... ఆఁ ఇంతకీ నేసెప్పొచ్చేదేటంటే ఆఁ మనవిసేత్తూ ముగిత్తున్నాను" అంటూ కూచున్నారు.

కవిగారి సన్నాయినొక్కు అనంతరం ఇద్దరు ఓహోనాయకులు, అంతకుముందు మాట్లాడిన మహానాయకులిద్దరినీ అలవాటు ప్రకారం

పొగిడారు. వాళ్ళిద్దరూ వుండటంవల్లనే భూమ్మీద చినుకు పడుతోంద న్నారు. చివర్న దేశ సేవచేయటంకోసం తమకో అవకాశం ఇవ్వాల్సిందిగా పైకి బాహాటంగా తెలిపోకుండా ప్రార్థించారు.

ఉపన్యాసాల అనంతరం—

కార్యక్రమంలోని ఒక భాగంగా పేదలకు వ్యవసాయ భూముల పట్టాలను పంచిపెట్టటం జరిగింది. పేదలంతా ఆనందించారు, ఇన్నాళ్ళకో మంచి పని జరిగినందుకు. పేదలంటే ఇష్టపడేవాళ్ళు సంతోషించారు, పేదల స్థితి మెరుగవుతున్నందుకు.

(ఇక్కడ, ఈ కథలో నాజోక్యం అవసరం. ఇది ఏదేశ కథో ఆ దేశభాష మీకు రాదని ముందే మనవిచేశాను కదా! ఆ దేశభాష రానపుడు, ఆ దేశంలోని ప్రజల పేర్లు చెబితే మాత్రం మీకేం అర్థమవు తుంది ? అంచేత ఈ కథలోని పాత్రలకి, మీకు తెలిసుంటాయనుకున్న నాకిష్టమైన పేర్లు పెట్టేస్తాను-)

ఆరోజు, ఉపన్యాసానంతరం భూమిపట్టాలు తీసుకున్న పేదలలో 'అ', 'క', 'ఖ' లు కూడా వున్నారు. వాళ్ళు ముగ్గురూ బ్రహ్మాండమైన ఆనందంతో ఇళ్ళకెళ్ళి, పదిరోజులపాటు వాళ్ళవాళ్ళ కుటుంబాలతోసహా ఆనందాలలో మునిగిపోయి, పదకొండో రోజున తేలి, వాళ్ళవాళ్ళ స్థలాలు ఆధీనంలోకి తీసుకోవటానికి వెళ్ళారు.

'అ', 'క', 'ఖ'ల పట్టాలలో ఏ సర్వేనంబర్లయితే వున్నాయో, ఎక్కడ వుండివుండాలని ఆ పత్రాలలో నిర్దేశింపబడివుందో- ఆ స్థలా లక్కడ లేవు. పైగా బలిసిన భూకామందుల ఆధీనంలో వున్నాయి. 'అ', 'క', 'ఖ'లు భూకామందుల్నడిగారు. వాళ్ళు కొట్టినంత పని చేశారు. వీళ్ళకేం చేయాలో తెలియక వాళ్ళనీ వాళ్ళనీ పట్టుకొని, చివరకు దానికి సంబంధించిన ప్రభుత్వాఫీసుని పట్టుకుని తమ గోడు వెళ్ల డించుకున్నారు. దానికి ఆ ఆఫీసువాళ్ళు "మీకు పట్టా ఇచ్చేవరకే మా

బాధ్యత కాని, స్వాధీనంచేయటం మాపనికాదు. పో"మ్మన్నారు "అ క ఖ"లు ఏంచేయాలో తెలీకుండా పోయారు.

ఎలాగైతేనేం-

ఆ భూములు ఎక్కడైతే వున్నాయో, ఆ గ్రామాధికారివద్దకు వెళ్ళి మొరపెట్టుకున్నారు. మనదేశంలో వందరూపాయలకు విలువచేసే డబ్బుని వాళ్ళ దేశంలో వాళ్ళ ముగ్గురి దగ్గిరా విడివిడిగా తీసుకుని, ముగ్గురిచేతా కలిపి ఒక కాగితం రాయించి తీసుకున్నాడు గ్రామాధికారి.

"ఫరవాలేదులే. నెమ్మదిమీద ఆ భూములు మీకే వస్తాయి" అన్నాడు గ్రామాధికారి.

"పరవాలేదులే. నెమ్మదిమీద ఆ భూములు మనకే వస్తాయి" అనుకుంటూ ఇళ్ళకెళ్ళిపోయారు 'అ క ఖ' లు.

ఈ కథ ఇక్కడితో అయిపోలేదు. ఆ గ్రామాధికారి వీళ్ళు రాసిచ్చిన పిటిషన్ తీసుకుని కామందుల దగ్గిరకెళ్ళి, వాళ్ళని భయపెట్టి, వాళ్ళదగ్గిర తలో వెయ్యిరూపాయిలు తీసుకుని, 'అ క ఖ' లు రాసిచ్చిన కాగితం కామందుల ముందే చింపి, అవతలపడేశాడు.

ఇదంతా తెల్సి, మిడిమిడిజ్ఞానంతోవున్న కొంతమంది ఇలా మాట్లాడుకున్నారు.

"పేదవాడికి న్యాయం జరగాలి అంటారు. ఏం జరుగుతోంది న్యాయం?"

"వాళ్ళ దృష్టిలో న్యాయమంటే ఇదేమరి!"

"అదికాదు దొంగలు ఊళ్ళు పంచుకున్నట్టు, పేదవాడి పేరుచెప్పి పొట్టగడుపుకోవటమెందుకు?"

"ఏ ఎండకాగొడుగు పట్టటం రాజకీయపు లక్షణం. పేదవాడి గురించి కబుర్లు చెప్పి, వాడికేదో మేలు చేస్తున్నట్టు కనిపించటం నేటి రాజనీతిజ్ఞత."

"నిజంగానే ఎంతో కొంత మేలు చేయచ్చుకదా!"

"చెయ్యచ్చు. ప్రభుత్వాని క్కూడా పేదవాడిక్కి ఎంతో కొంత మేలు చేయాలనే వుండొచ్చు."

"ప్రభుత్వానికీ, పేదవాడికీ మధ్యనున్న వాళ్ళు కాజేస్తున్నారంటావ్"

"కొంతవరకూ నిజమే కానీ వ్యవస్థ ఇలాగే వున్నపుడు పేదవాడికి సరైన న్యాయంచేయటం కుదరదు. ఎందుకంటే- మైనారిటీ వర్గాలవారిని సంరక్షించటం మన రాజ్యాంగలక్షణం కదా! మరి మందేశంలో ధనవంతులు మైనారిటీవర్గంవారే కదా!"

"మరి- పేదవారి గురించి సభలు, సమావేశాలు జరిపి మేలుచేస్తూన్నట్టు కన్పిస్తూ కీడుచేయట మెందుకు?"

"ఓరి వాజమ్మా! మనదేశ జనాభాలో పేదవారే ఎక్కువకదా, మరి వాళ్ళని ఆకట్టుకోకపోతే రేపు ఎన్నికలలో నెగ్గటమెలాగోయ్!"

"ఒక్క పాయింట్ చెప్పు - ఇంక అడగను. దేశజనాభాలో ఎక్కువమంది పేదవాళ్ళయినపుడు వాళ్ళ మేలు చూడకపోవటం ధర్మంగా వుందా?"

"కానీ- ప్రతిఫలాపేక్షలేకుండా ఎప్పుడూ ఏపనీ జరుగదు కదా! ఎన్నికలకోసం పేదవాళ్ళు ఎంత చందా ఇవ్వగలరంటావ్? పేదవాడికి మేలుచేయటంకన్నా. పేదవాడికీ జై! అనటం సుళువుకదా!"

ఆ ప్రశ్నలేసే అతను ఎవరోకాని, మరి- మాట్లాడలేదు.

* * *

ఇప్పుడు చెప్పండి సార్! ఇలా చెట్టుపేరు చెప్పి కాయలమ్ముకోవటం మనదేశంలో చచ్చినా జరగదు. కాకపోయినా- అంత దౌర్భాగ్యస్థితి మనకేంపట్టిందండీ!